RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 40 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 13 నవంబర్ 2024

# ప్రతిపక్షం లేకున్నా.. బాధ్యతగా ఉండాల్సిందే

## ప్రజాసమస్యలపై స్పష్టతతో మాట్లాడాలి

- సభా కార్యక్రమాలపై అవాహన పెంచుకోవాలి
- బడ్జెట్ కటాయింపులు, బిల్లులపైనా చర్చించాలి
- ఎమ్మెల్యేలకు శిక్షణ కార్యక్రమలో చంద్రబాబు సూచనలు



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి: సభలో ప్రతిపక్షం లేదు కదా మనకేముంది అని అనుకోవద్దని ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వాళ్లకు బాధ్యత లేదు... కానీ మనకు ఉందని గుర్తించాలని అన్నారు. మనం ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం. ప్రజలకు ఏం అవసరమో... ప్రజలకు ఏం చేశామో చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక. అసెంబ్లీకి మేము పంపిన ప్రతినిధి మా కోసం ఏం మాట్లాడుతున్నారని ప్రజలు ఎప్పుడూ గమనిస్తారని గుర్తుంచుకోవాలసి సిఎం చంద్రబాబు తెలిపారు.ఏపీ అసెంబ్లీ కమిటీ హాలులో ఎమ్మెల్యేలకు అవగాహన సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలతో సీఎం మాట్లాడుతూ.. రానురాను ఎమ్మెల్యేలకు స్జబెక్టు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గుతోందని.. ఇది మంచిది కాదని... నిరంతరం నేర్చుకోవాలి... తెలుసుకోవాలని సూచించారు. 'ఇప్పుడు ఎవరు ఏ స్జబెక్టు మాట్లాడుతున్నారో నేను కూడా నోట్ చేసుకుంటున్నా. కేంద్ర బడ్జెట్‌లో కూడా ఏ విధమైన నిధుల కేటాయింపులు ఉన్నాయో స్టడీ చేసుకుంటే ఎమ్మెల్యేలకు ఉపయోగ పడుతుంది. పని చేయాలన్న ఆసక్తి మీలో ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. సమస్యలపై మాట్లాడకుండా బూతులు తిడితే ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో స్వాగతించరని.. గతంలో అదే జరిగిందన్నారు.

**మిగతాది 2లో...**

## సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు

# మరో ధర్మాసనానికి

- 'నాట్ బిఫోర్ మి' చెప్పిన జస్టిస్ సంజయ్ కుమార్
- విచారణను మరో ధర్మాసనానికి మార్చిన సీజేఐ
- ఎంపీ రఘురామ దాఖలు చేసిన పిటిషన్లు రెండూ జస్టిస్ ఓకా బెంచ్ కు మార్పు



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి: సుప్రీంకోర్టులో వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీజేఐ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసు విచారణను మరో ధర్మాసనానికి అప్పగించింది. ఇప్పటి వరకు ఈ కేసులో వాదనలు విన్న సీజేఐ బెంచ్.. తాజాగా మరో బెంచ్ ముందుకు పంపిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ పై బయట ఉన్న సంగతి తెలిసిందే. ఈ బెయిల్ ను రద్దు చేయాలంటూ రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు.దీంతో పాటు ఈ కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలంటూ రఘురామకృష్ణరాజు మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. కాగా, సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినప్పటికీ సీబీఐ కేసుల్లో తీర్పు తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది.జగన్ అక్రమాస్తుల కేసు మంగళవారం విచారణకు రాగా.. సీజేఐ బెంచ్ లోని జస్టిస్ సంజయ్ కుమార్ 'నాట్ బిఫోర్ మి' చెప్పారు. దీంతో కేసును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో ధర్మాసనానికి మార్చారు. గత విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ నాట్ బిఫోర్ మి చెప్పినా పొరపాటున మంగళవారం మళ్లీ లిస్ట్ అయినట్లు సీజేఐ తెలిపారు. ఈ కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం డిసెంబర్ 2వ తేదీన విచారిస్తుందని తెలిపారు. ఎంపీ రఘురామ దాఖలు చేసిన రెండు పిటిషన్లనూ జస్టిస్ ఓకా ధర్మాసనమే విచారిస్తుందని చెప్పారు.

## మహారాష్ట్రలో పవన్ కల్యాణ్

# ఎన్నికల ప్రచారం...!

- ఎన్డీయే కూటమి కోసం ప్రచారం చేయనున్న ఏపీ డిప్యూటీ సీఎం
- తెలుగు వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో ప్రచారం



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. ఈ క్రమంలోనే బీజేపీ అధిష్ఠానం మహారాష్ట్ర ఎన్నికల్లో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ తో ప్రచారం చేయించనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో వివిధ ప్రాంతాల్లో బీజేపీ కోసం ప్రచారం చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. ఎన్డీయే కూటమిలో భాగమైన జనసేన.. ప్రస్తుతం మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి సహకరించనుంది. రెండు రోజుల పాటు ప్రచారం చేసేందుకు పవన్ కల్యాణ్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందుకోసం బీజేపీ సీనియర్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# వర్రా రవీంద్రారెడ్డికి 14 రోజుల రిమాండ్

- రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు
- సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో వర్రా రవీంద్రారెడ్డి అరెస్ట్
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి
- వైసీపీ సోషల్ మీడియా గుట్టు బయటపెట్టిన వర్రా!
- ఆ ముగ్గురే కీలకమని రిమాండ్ రిపోర్టులో వెల్లడి




అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. వైసీపీ సోషల్ మీడియాలో సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డి, సుమా రెడ్డి కీలకమైన వ్యక్తులు అని వర్రా వెల్లడించాడు. మొదట్లో వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్ రెడ్డి సూచనలతో పోస్టులు పెట్టామని,

**మిగతాది 2లో...**




# చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా భయపడం

## : మాజీ మంత్రి అంబటి రాంబాబు

2లో

# ఏపీ ప్రభుత్వం, రిలయన్స్ ఎనర్జీ మధ్య కుదిరిన ఒప్పందం



- 30 రోజుల్లోనే రిలయన్స్ తో ఒప్పందం కుదరడం చారిత్రాత్మకం: మంత్రి నారా లోకేశ్
- బయో ఇంధన ప్రాజెక్టులో రూ.65 వేల కోట్ల పెట్టుబడులకు రిలయన్స్ సిద్ధం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు రిలయన్స్ పెట్టుబడులే నిదర్శనమని వ్యాఖ్యలు

2లో

# సజ్జల భార్గవరెడ్డి అరెస్ట్ కు రంగం సిద్ధం... ?

## లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు

- నవంబరు 8న వర్రా, భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు
- భార్గవరెడ్డి విదేశాలకు పారిపోతాడన్న అనుమానం

అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి: వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి వాంగ్మూలం నేపథ్యంలో, ఏపీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జి సజ్జల భార్గవరెడ్డి, వైసీపీ సోషల్ మీడియాలో కీలక వ్యక్తి, జగన్ కు దగ్గరి బంధువు అర్జున్ రెడ్డిల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవలే వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, సజ్జల భార్గవరెడ్డి విదేశాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు కడప పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నవంబరు 8వ తేదీన వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వైఎస్సార్ జిల్లాకు చెందిన హరి అనే దళితుడి ఫిర్యాదు ఆధారంగా నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదైంది. సోషల్ మీడియా



పోస్టులపై ప్రశ్నించినందుకు తనను కులం పేరుతో దూషించారని హరి తన ఫిర్యాదులో ఆరోపించాడు. గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడైన సజ్జల భార్గవరెడ్డి వైసీపీ సోషల్ మీడియాను నడిపిస్తున్నాడు. జగన్ వ్యతిరేక నేతలపై తప్పుడు పోస్టులు పెట్టడంలో భార్గవరెడ్డే కీలకమని వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడైంది. భార్గవరెడ్డిపై ఇప్పటికే ఏపీలో పలు కేసులు ఉన్నాయి. ఇప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో అతడి చుట్టూ ఉచ్చు మరింతగా బిగుస్తోంది. ఈ నేపథ్యంలోనే, అతడు తప్పించుకుని పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

# చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా భయపడం

## : మాజీ మంత్రి అంబటి రాంబాబు



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
సోషల్‌మీడియా కార్యకర్తలకు వైసీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఆనాడు ఎమ్మెల్యేలను లాగేసుకుని వైఎస్ జగన్‌ను ఒంటరి చేయాలనే ప్రయత్నం చేసి చంద్రబాబు భంగపడ్డారని అన్నారు. ఇప్పుడు మళ్లీ వైసీపీ సోషల్‌మీడియాను బయపెట్టాలని కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు మళ్లీ భంగపాటు తప్పదని చెప్పారు. చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా సరే వైసీపీ కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు. గుంటూరు జైలులో ఉన్న వైసీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌లు మేక వెంకట్రామిరెడ్డి, కళ్లం హరికృష్ణ రెడ్డి, పానుగంటి చైతన్యను పేర్ని నాని, ఎమ్మెల్యే లేళ్ల అప్పిరెడ్డితో కలిసి అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. వర్రా సుధారాణి దంపతులను పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. మహిళ అని కూడా చూడకుండా పోలీసులు టార్చర్ చేస్తున్నారని మండిపడ్డారు. వర్రా రవీందర్ రెడ్డిని అర్ధరాత్రి ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. ముసుగు వేసి మీడియా ముందు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఏపీలో పౌర హక్కులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ కుటుంబసభ్యులపై ఐటీడీపీ సోషల్‌మీడియాలో చాలా దారుణంగా పోస్టులు పెడుతున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు. వాటిపై వైసీపీ నేతలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వాళ్లే ఫేక్ అకౌంట్లతో అక్రమ పోస్టింగ్‌లు పెడుతున్నారని తెలిపారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించి వైఎస్ జగన్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లు చెప్పమని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. చట్టాన్ని పాటించకపోతే సర్వనాశనమవుతారని హెచ్చరించారు. వైసీపీ సోషల్‌మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇదే విషయమై తొందరలోనే సుప్రీంకోర్టు, రాష్ట్ర గవర్నర్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు.

# ఏపీ ప్రభుత్వం, రిలయన్స్ ఎనర్జీ మధ్య కుదిరిన ఒప్పందం



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
ఏపీ పారిశ్రామిక రంగంలో నేడు కీలక ముందడుగు పడింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో బయో ఇంధన ప్రాజెక్టుకు సంబంధించి రిలయన్స్ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారుల నడుమ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఐదు నెలల్లోనే రిలయన్స్ ఎనర్జీ సంస్థ బయో ఇంధన ప్రాజెక్టులో రూ.65 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని అన్నారు.
తాను ముంబాయిలో రిలయన్స్ చైర్మన్ ముఖేశ్ అంబానీ, రిలయన్స్ ఎనర్జీ అధినేత అనంత్ అంబానీతో చర్చలు జరిపిన 30 రోజుల్లోనే ఒప్పందం కుదరడం చారిత్రాత్మక ఘట్టమని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు ఈ ఒప్పందం ఊతమిస్తుందని చెప్పారు.
ఇప్పటివరకు యూపీలోని బారాబంకీ బయోఫ్యూయల్ ప్రాజెక్టు వేగవంతంగా అమలైందని, రాష్ట్రంలో రిలయన్స్ ఏర్పాటు చేయబోయే ప్రాజెక్టు ఆ రికార్డును బద్దలు కొడుతుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.
డిసెంబర్ 28న ప్రకాశం జిల్లా కనిగిరిలో తొలి బయో ఇంధన ప్రాజెక్టుకు శంకుస్థాపన జరుగుతుందని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 500 ప్లాంట్ల ఏర్పాటు పూర్తిచేస్తారని చెప్పారు.
తొలిదశ ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ 28 నాటికి (ఏడాదిలో) పూర్తిచేస్తామని రిలయన్స్ ఎనర్జీ ఏపీ ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... రిలయన్స్ బయో ఇంధన ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.
రిలయన్స్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఏపీ ప్రజలతోపాటు పారిశ్రామికవేత్తల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు అవుతున్నందుకు రిలయన్స్ అధినేతలు ముఖేశ్ అంబానీ, అనంత్ అంబానీలకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

# సోషల్ మీడియాలో నాపై ప్రచారాన్ని జగన్ ప్రోత్సహించారు: షర్మిల

**సోషల్ మీడియా పోస్టుల అంశంపై షర్మిల స్పందన**

**జగన్ వద్దు అని చెప్పి ఉంటే తప్పుడు ప్రచారం ఆగేదని వెల్లడి**

**వైసీపీ సోషల్ మీడియా ఓ సైతాన్ ఆర్మీలా తయారైందని విమర్శలు**

**ఇప్పటివరకు పట్టుబడింది విషనాగులేనని వ్యాఖ్యలు**

**విషనాగులతో పాటు అనకొండను కూడా పట్టుకోవాలని సూచన**




అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో తాను కూడా బాధితురాలినేనని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుల ద్వారా తనపై ప్రచారం వెనుక ఉన్నది జగనే అని స్పష్టం చేశారు. నాపై దుష్ప్రచారం జరుగుతుంటే ఆయన ఆపలేదు... దానర్థం ఏమిటి? ఆ అసభ్యకర ప్రచారాన్ని ఒకరకంగా ఆయన ప్రోత్సహించినట్టే కదా! అని షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ వద్దు అని చెప్పి ఉంటే ఆ ప్రచారం అప్పుడే ఆగిపోయి ఉండేదని అన్నారు. వైసీపీ సోషల్ మీడియా ఓ సైతాన్ ఆర్మీలా తయారైందని పేర్కొన్నారు. వాళ్లకు వ్యతిరేకంగా ఉండేవారిపై సోషల్ మీడియాలో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలు రాజకీయాల్లో కొనసాగాలంటే భయపడే పరిస్థితి తెచ్చారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పుడు పట్టుబడ్డ వాళ్లంతా విషనాగులేనని, ఆ సోషల్ మీడియా విషనాగులతో పాటు అనకొండను కూడా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని షర్మిల ఉద్ఘాటించారు. ఇక, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లను అనడం జగన్ అహంకారానికి నిదర్శనం అని విమర్శించారు. జగన్ కు ఒకప్పుడు 151 స్థానాలు ఇచ్చిన ప్రజలు, ఇప్పుడు 11 స్థానాలకే పరిమితం చేశారని, జగన్ అక్రమాలు, అవినీతిని ప్రజలు గమనించారని షర్మిల వివరించారు. ప్రజల తీర్పుపై జగన్ కు గౌరవం ఉండాలని హితవు పలికారు.
సభలో మైకు ఇవ్వలేదంటే, అది మీ స్వయంకృతాపరాధమే అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజలు ఓట్లు వేసింది అసెంబ్లీకి వెళ్లడానికి కాదా? మరి ప్రజల ఓట్లతో గెలిచి అసెంబ్లీకి హాజరుకాకపోవడం అంటే ప్రజలను వెన్నుపోటు పొడిచినట్టు కాదా? అని షర్మిల విమర్శించారు. అసెంబ్లీకి గైర్హాజరవడం ద్వారా వైసీపీ ఎమ్మెల్యేల అజ్ఞానం ఏంటో బయటపడిందని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు, అసెంబ్లీకి వెళ్లబోమని చెప్పి ఓట్లు అడిగారా? అని నిలదీశారు. మీకు సత్తా లేకపోతే రాజీనామా చేయండి అంటూ డిమాండ్ చేశారు.

# పోలీస్ శాఖకు పూర్వ వైభవం

**: హోంమంత్రి అనిత**

**పోలీస్ శాఖకు 2024- 25 బడ్జెట్‌లో రూ.8,495 కోట్ల కేటాయింపు**

**కొత్తగా 4 స్పెషల్ పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు చేస్తామన్న మంత్రి అనిత**



అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖకు 2024- 25 బడ్జెట్‌లో రూ.8,495 కోట్లు కేటాయించడం జరిగిందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర కొర సౌకర్యాలతో పోలీసులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీస్ శాఖలో ప్రక్షాళన చేపట్టిందన్నారు. పోలీసు బలగాల ఆధునీకీకరణ, మౌలిక వసతుల కోసం ఇప్పటికే రూ.62 కోట్ల నిధులు విడుదల అయ్యాయన్నారు.
శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, రాజమహేంద్రవరంలో కొత్తగా 4 స్పెషల్ పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని పట్టిపీడించిన మాదక ద్రవ్యాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. అందుకే యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ కేసుల సత్వర పరిష్కారానికి 13 ఫాస్ట్ ట్రాక్ ఎన్డీపీఎస్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.
విద్యార్థులను మత్తుకు బానిసలు కాకుండా ఉంచేందుకు ఉన్నత విద్యా సంస్థల్లో 3,172 యూనిట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా 300 మంది సిబ్బందితో ఉమెన్ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి అనిత తెలిపారు.

# ప్రతిపక్షం లేకున్నా, బాధ్యతగా ఉండాల్సిందే

(మొదటి పేజి తరువాయి)

ఒకప్పుడు అసెంబ్లీ ప్రొసీడింగ్స్ ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో వచ్చేవని.. కానీ ఇప్పుడు లైవ్, సోషల్ మీడియాలో కూడా ప్రసారం అయ్యే దాకా టెక్నాలజీ వచ్చిందన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్ళకు సభలో పబ్లిక్ పాలసీలు రూపొందిస్తామని.. ఈ పాలసీలు ప్రజా జీవితంలో మార్పులు తెస్తాయని చంద్రబాబు అన్నారు. గతంలో కొందరు ఎమ్మెల్యేలను విదేశాలకు పంపి ఆయా దేశాలు సాధించే ఫాస్ట్ గ్రోత్ రేట్ గురించి స్టడీ చేయించామని గుర్తుచేశారు. మనం తెచ్చే పాలసీలే రాష్ట్రంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపిస్తాయన్నారు. గతంలో ఒక సబ్జెక్టుపై ఎంత సమయమైనా చర్చించేవాళ్లమన్నారు. విజన్-2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయలని తెలిపారు. మంచి చర్చ, సమస్యల పరిష్కారానికి శాసనసభ, శాసన మండలి ఇకపై వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలని, తెలుసుకోవాలని సూచించారు. విజన్ 2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పనిచేయాలనే ఆసక్తి ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజలకు ఏం అవసరం.. మనం ఏం చేశామనేది చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో తమ ప్రతినిధి మాట్లాడుతున్నారని ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. అలాంటప్పుడు బూతులు మాట్లాడితే ప్రజలు స్వాగతించరని చెప్పారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షత వహించారు.

# వర్రా రవీంద్రారెడ్డికి 14 రోజుల రిమాండ్

(మొదటి పేజి తరువాయి)

ఆ తర్వాత సజ్జల భార్గవరెడ్డి బాధ్యతలు అందుకున్నాక మరింతగా విజృంభించామని చెప్పాడు. వైసీపీకి వ్యతిరేకంగా టీవీ చానళ్లలో మాట్లాడే వాళ్లని తాము టార్గెట్ చేశామని... నేతలు వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టామని వివరించాడు. గతేడాది సెప్టెంబరులో పవన్ కల్యాణ్, వారి పిల్లలపై పోస్టులు పెట్టినట్టు వర్రా అంగీకరించాడు. అయితే, ఆ పోస్టులు తొలగించాలని వెంకటాద్రి అనే వ్యక్తి వచ్చాడని, రూ.2 లక్షలు ఇస్తే ఆ పోస్టులు తొలగిస్తానని అతడిని డిమాండ్ చేసినట్టు తెలిపాడు. 2020 నుంచి ఐప్యాక్ టీమ్ ద్వారా కంటెంట్ వచ్చేదని, తాము ఫేస్ బుక్ లో పోస్టు చేసేవాళ్లమని తెలిపాడు. జగనే కావాలి, జగనన్న రావాలి యాప్ లోనూ పోస్టు చేసేవాళ్లమని పేర్కొన్నాడు. జడ్జిలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాలని సజ్జల భార్గవరెడ్డి ఒత్తిడి తెచ్చాడని వర్రా పేర్కొన్నాడు. గత ఏడాది నుంచి నా ఫేస్ బుక్ ఐడీతో భార్గవరెడ్డి పోస్టులు పెడుతున్నాడు అని వర్రా వెల్లడించాడు. వైఎస్ షర్మిల, విజయమ్మ, సునీతలపై అభ్యంతరకర పోస్టులు పెట్టాలని అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి తమకు సూచించడంతో పాటు, కంటెంట్ కూడా ఇచ్చేవాడని తెలిపాడు. ఆ పోస్టులు ఏ విధంగా ఉండాలన్నది అవినాశ్ రెడ్డి, రాఘవరెడ్డి చర్చించుకునేవాళ్లని వెల్లడించాడు. సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో అరెస్టయిన వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా... న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడం తెలిసిందే.

# మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే


## కేసులకు భయపడొద్దు

## వైసీపీ ఎమ్మెల్సీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం



అమరావతి, నవంబర్ 12 ఆంధ్ర ప్రగతి:
వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపీనే అని మాజీ సీఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. కేసులకు భయపడొద్దని.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్సీలతో తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వైసీపీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష హోదా కోరుతూ కోర్టులో పిటిషన్ వేశామని జగన్ తెలిపారు. కానీ దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమాధానం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఉన్న ఏకైక ప్రతిపక్షం మనమే.. అయినా ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని అన్నారు. మనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందని.. అధికార పక్షం అంగీకరించడం లేదని తెలిపారు. అసెంబ్లీలో అవకాశం ఇవ్వకుంటే.. మీడియా ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకపోతే అసెంబ్లీ సమావేశాలేమీ ఆగవని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు సీరియస్‌గా జరుగుతాయని ఆయన స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలు విధిగా అసెంబ్లీకి హాజరవ్వాలని సూచించారు. బడ్జెట్‌పై రేపు అసెంబ్లీ కమిటీ హాలులో ఎమ్మెల్యేలు అందరికీ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. అలాగే విప్, చీఫ్ విప్‌లను కూడా రేపే ఖరారు చేస్తామని అన్నారు.

# శ్రీవారికి రూ. 4. 82 కోట్లు ఆదాయం



తిరమల, నవంబర్ 12ఆంధ్ర ప్రగతి::
తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కేవలం ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే స్వామిదర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,917 మంది భక్తులు దర్శించుకోగా 25,161 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4. 82 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎస్.సత్య నారాయణ ప్రమాణం రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

# చీఫ్ విప్ లు, విప్ లను ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
ఏపీ ప్రభుత్వం అసెంబ్లీ, శాసనమండలిలో కీలక పదవులు భర్తీ చేసింది. అసెంబ్లీ, మండలిలో చీఫ్ విప్ లు, విప్ లను ప్రకటించింది. అసెంబ్లీలో 15 మందిని, మండలిలో ముగ్గురిని విప్ లు గా నియమించింది.
అసెంబ్లీలో చీఫ్ విప్: జీవీ ఆంజనేయులు శాసనమండలిలో చీఫ్ విప్: పంచుమర్తి అనురాధ
అసెంబ్లీలో విప్ లు...
1. బొండా ఉమ (టీడీపీ)2. కాలవ శ్రీనివాసులు (టీడీపీ)3. యార్లగడ్డ వెంకట్రావు (టీడీపీ)
4. ఆదినారాయణరెడ్డి (బీజేపీ)5. బొమ్మిడి నాయకర్ (జనసేన)6. బెందాళం అశోక్ (టీడీపీ)
7. రెడ్డప్పగారి మాధవి (టీడీపీ)8. అరవ శ్రీధర్ (జనసేన)9. తంగిరాల సౌమ్య (టీడీపీ)
10. దాట్ల సుబ్బరాజు (టీడీపీ)11. దివ్య యనమల (టీడీపీ)12. పీజీవీఆర్ నాయుడు (టీడీపీ)
13. తోయక జగదీశ్వరి (టీడీపీ)14. బొలిశెట్టి శ్రీనివాస్ (జనసేన)15. వీఎం థామస్ (టీడీపీ)
మండలిలో విప్ లు...
1. వేపాడ చిరంజీవి (టీడీపీ)2. పి.హరిప్రసాద్ (జనసేన)3. కంచర్ల శ్రీకాంత్ (టీడీపీ)
విప్ ల జాబితాలో... జనసేన నుంచి ముగ్గురు అసెంబ్లీ విప్ లు గా నియమితులు కాగా, బీజేపీ నుంచి ఒకరికి అవకాశం దక్కింది. అలాగే, మండలిలో జనసేన నుంచి ఒకరికి విప్ గా అవకాశం లభించింది.ఇక అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పదవిని ఇంకా ప్రకటించాల్సి ఉంది.

# సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయండి.

**-రోజు 50 సీసీ రోడ్ల నిర్మాణ పనులు గ్రౌండింగ్ కావాలి. -సాధించాలనే తపన ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు12:**
పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన 1026 సిసి రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సిసి రోడ్ల నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఈఈ రఘురామిరెడ్డి, డిఈ, ఏఈలు, సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లాలో 1023 సీసీ రోడ్లు, 3 బీటీ రోడ్లను దాదాపు 86 కోట్ల రూపాయలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నత విద్యను అభ్యసించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా ఎంపిక అయ్యారని... చేయాలన్న తపన ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు పూర్తి స్థాయి శ్రద్ధ పెట్టాలన్నారు. అన్ని పారామీటర్లలో జిల్లాను మొదటి ఐదు స్థానాల్లో ఉంచేందుకు ప్రయత్నించాలన్నారు. చేపట్టిన నిర్మాణ పనులను మొక్కుబడి రీతిలో కాకుండా పూర్తి చేయాలన్న తపనతో పనిచేసి మీ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పురమాయించిన పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తయితే ప్రయోజనం ఉంటుంది కానీ ఆలస్యంగా చేస్తే ఎలాంటి గుర్తింపు ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే సిమెంట్ రోడ్ల నాణ్యత కాల పరిమితి 30 సంవత్సరాల ఉంటుందని నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. రోడ్లతో పాటు సైడ్ డ్రైన్ లనుకూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో హార్టికల్చర్ ప్లాంటేషన్, లేబర్ బడ్జెట్, అపార్ ఐడి, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, జాతీయ రహదారుల



భూసేకరణ, తదితర పారామీటర్ల ప్రగతిలో వెనుకబడి ఉన్నామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి 1026 పనులలో 284 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని నిర్మాణాల ప్రగతి ఆశించిన రీతిలో లేదని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ చివరి తేదీ నాటికి అన్ని రోడ్లు పూర్తి కావాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేస్తూ రోజువారి లక్ష్యాన్ని కేటాయించారు. ఏజెన్సీలు, సిమెంటు, ఇసుక ఇతర మెటీరియల్ ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పని పూర్తవుతుందని... కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డలో 240 రోడ్డు నిర్మాణ పనులకు గాను 46 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 10 పది పనుల చొప్పున గ్రౌండ్ కావడంతో పాటు ఇదివరకే గ్రౌండింగ్ అయిన పది పనులు పూర్తి కావాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారు. అలాగే నంద్యాలలో 101 పనులకు గాను 20 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 5 పనులు, పాణ్యం నియోజకవర్గంలో 71 పనులకు గాను 24 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 3 పనులు, శ్రీశైలంలో 162 పనులకు గాను 34 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 9 పనులు, బనగానపల్లెలో 145 పనులకు గాను 75 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 8 పనులు, డోన్ లో 64 పనులకు గాను 23 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 3 పనులు, నందికొట్కూరులో 236 పనులకు గాను 56 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 12 పనుల చొప్పున ప్రతిరోజు 50 పనులు గ్రౌండింగ్ కావడంతో పాటు ఇదివరకే చేపట్టిన 50 నిర్మాణ పనులు పూర్తికావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 23 వ తారీఖున పూర్తి అయిన పనులను స్థానిక ప్రజాప్రతినిధులచే ప్రారంభోత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ నెలాఖరులోగా ఇసుక డిపోలకు మినరల్ డిపో లైసెన్స్ లు మంజూరు చేసి ఇసుక స్టాక్ పెడతామని బల్క్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల ప్రగతికి సంబంధించి ప్రతి గురువారం కేటాయించిన లక్ష్యం పైననే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రగతిని సమీక్షిస్తానన్నారు. చేపట్టిన నిర్మాణ పనులపై నిఘా ఉంటుందని సీఎం గారు ప్రత్యక్షంగా పర్యవేక్షించి సమీక్షించే అవకాశం ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిసి రోడ్ల నిర్మాణ పనులను చాలెంజె గా తీసుకొని లక్ష్యాన్ని మించి అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు.

## రైల్వే ఉద్యోగి విజయ్ కృష్ణ పై దాడి చేసిన వారిపై కఠిన చర్య తీసుకోవాలి.

### బాధితుడు విజయ్ కృష్ణని పరామర్శించిన సిపిఐ నేతలు



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:
డోన్ రైల్వే రైల్వే కార్మికుల యూనియన్ ఎన్నికల్లో మద్రి రాఘవయ్య యూనియన్ వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని నేపంతో మద్రి రాఘవయ్య కుమారుడు మద్రి గోవిందరాజులు డోన్ లో రైల్వే సంగ్ తప్ప ఇతర ఉద్యోగులు ఎవరు ఉండకూడదని రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున మద్దతుగా ఉన్నాడని విజయ్ కృష్ణ అనే ట్రాక్ మీద పైన రాత్రి 7:30నిముషాల సమయంలో ఇంటిదగ్గర వెళ్లి అతనిపై మద్రి గోవిందరాజులు అనుచరులు ఇద్దరు పోయి దాడి చేసి ఇష్టం వచ్చినట్లు గాయపరిచి ఉద్యోగుల పట్ల రౌడీయిజం కొనసాగిస్తున్న మద్రి గోవిందరాజులు అతను అనుచరుల పైన అత్యాయత్నం కేసు నమోదు చేయాలని బాధితుడు విజయ్ కృష్ణల పరామర్శించిన అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, మండల, పట్టణ కార్యదర్శులు బి.నారాయణ మోట రాముడు పృథ్వి కుమార్.డోన్ ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ డోన్ లో ఒకే ఒక యూనియన్ రైల్వే సాంగ్ మాత్రమే ఉండాలి అని నిరంకుశ ఆధ్వర్యంలో ఏ యూనియన్ వ్యతిరేకంగా ఉండకూడదని ప్రశ్నించకూడదని ఇతర ఉద్యోగ సంఘాల యూనియన్ల పైన ఇలాంటి భౌతిక దారులు పాల్పడడం హేమమైన చర్య వారుఅన్నారు.జాతీయస్థాయిలో నాయకత్వం వహిస్తున్నటువంటి మద్రి. రాఘవయ్యకు మంచి పేరు ఉంది కానీ ఆయన కుమారుడు మద్రి గోవిందరాజులు ఉద్యోగుల పట్ల ఇలాంటి రౌడీయిజం చేయడం మానుకోవాలని సిపిఐ నాయకులు హితువు పలికారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే మద్రి గోవిందా రాజులకు సరైన గుణపాఠం చెబుతారని వారన్నారు రైల్వే ట్రాక్మెన్ విజయ్ కృష్ణ పైన దాడి చేసిన మరీ గోవిందరాజులు అతని అనుచరుల మీద అత్యాయత్నం కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఐఐటి పరీక్షలో శాంతినికేతన్ విద్యార్థుల ప్రభంజనం




ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:
క్రాంతినగర్ లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఐఐటి ఒలింపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో విజయం సాధించారు.అభ్యాస్ అకాడమీ వారు అక్టోబర్ నెలలో నిర్వహించిన ఐఐటి ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజయం సాధించారు. 8వ తరగతి విద్యార్థి లోకేష్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. 7వ తరగతి విద్యార్థి సంతోష్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. 6వ తరగతి విద్యార్థి పూర్ణచంద్ర రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు.వీరికి పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ మెమెంటో ప్రధానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ మాట్లాడుతూ "మా విద్యార్థులు సాధించిన ఈ విజయం మాకు గర్వకారణమని,మా విద్యార్థుల ప్రతిభకు ఈ విజయం తార్కాణం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఐఐటీ ఇంచార్జి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రదానం

### -నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:**
నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీవాసి పసుపుల సత్యనారాయణ మృతి చెందడంతో వారి కుమారులైన పసుపుల రవి, సుధాకర్, వెంటనే స్పందించి నేత్రదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్, యోగా గురువు కందె ఆనంద్ గురూజి విషయాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరికి తెలిపి కర్నూల్ నుండి రెడ్ క్రాస్ ఐ టెక్నీషియన్స్ ను పిలిపించి సత్యనారాయణ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆర్గాన్ డొనేషన్ ఆనంద్ గురూజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరణించినప్పుడు వారి నేత్రాలను ఐ బ్యాంకుకు సమర్పించిన యెడల వారు వాటిని భద్రపరిచి అందులకు ఆపరేషన్ ద్వారా చూపులు ప్రసాదించడం జరుగుతుందని, ఇలా సేకకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ కు పంపడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ నేత్రదానం చేసిన పసుపుల సత్యనారాయణ కుమారులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరు కూడా చనిపోయిన తర్వాత నేత్రదానము చేసేటందుకు ముందుకు రావాలని, ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడు సత్యనారాయణ ఆదర్శంగా తీసుకొని, అంధత్వ నివారణ కోసం చైతన్యపరిచాలన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ట్రెజరర్ నాగేశ్వరరావు, ఎన్ రామకృష్ణ, పసుపుల రవి, పసుపుల సుధాకర్, మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెటా లేకపోతే పశువుల మార్కెటా.?

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:
ఆత్మకూరు పట్టణంలో వున్నది కూరగాయల మార్కెటా లేకపోతే పశువుల మార్కెటా చెప్పాలని సిపిఐ (యంయల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ అధికారులను సూటిగా ప్రశ్నించారు అనంతరం ఆత్మకూరు పట్టణం గాలి రవిరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మోడల్ సంతలని చెప్పి వ్యాపారుల ఆశలను కలగానే మిగిల్చారని నూతన హామీని విస్మరించిందని కానీ ప్రభుత్వాలు మారిన వ్యాపారులకు ప్రజలకు అవస్థలు పడుతున్నారని వారు విమర్శించారు. మార్కెట్ సంతలలో ఏడాదికి ఎనిమిది లక్షల రూపాయలు ఆదాయం వున్న మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమైయ్యారన్నారు. ఇక్కడ సుమారు కొన్ని ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు దెబ్బతిని వర్షాకాలంలో ఇక్కడి వ్యాపారుల కూరగాయలు తడిసి పోతున్నాయని అలాంటప్పుడు



అక్కడ వ్యాపారాలు ఎలా చేసుకోవాలని వ్యాపారులు ఎలా చేసుకోవాలని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇక్కడ వ్యాపారులకు అనుగుణంగా అరుగులు ఏర్పాటు చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. గతంలో వేసిన సిమెంట్ బెడ్లు దెబ్బతిని వర్షం వస్తే అమ్మకాలు బురదలో జరపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. మార్కెట్ కు మూడు చోట్ల గేట్లు కూడా సరిగలేవని దానివలన మార్కెట్ లోకి పశువులు చేరి అపరిశుభ్రంగా చేస్తూ అక్కడికి వచ్చే వినియోగధారులపైన వ్యాపారులపైన దాడులు జరిగిన సందర్భలు కూడా వున్నాయని వారు గుర్తు చేశారు మార్కెట్ కు వచ్చే వినియోగధారులకు ప్రజలకు మూత్రశాలలు కానీ త్రాగునిటీ సౌకర్యాలు రాత్రిపూట వచ్చే వ్యాపారులకు విద్యుత్ దీపాలు లేకపోవడం తో ఆకతాయిలకు తాగుబోతులకు అడ్డాగా మారిందని వారు ఆరోపించారు ఇకానైనా మునిసిపల్ అధికారులు గతంలో కౌన్సిల్ లో నిర్మాణం చేసిన నాలుగు కోట్ల రూపాయలతో మార్కెట్ ను అభివృద్ధి చెయ్యాలని వారు డిమాండ్ చేశారు కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వం లో వున్న స్థానిక ఎమ్మెల్యే గారైన చొరవ తీసుకొని మార్కెట్ వ్యాపారుల ప్రజల అవస్థలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

## ఆశా వర్కర్స్ అక్రమ రాజకీయ తొలగింపులు ఆపాలి

**ఆశా వర్కర్స్ కు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.**
**ఉద్యోగ భద్రత కల్పించాలి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:
పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్స్ ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆశ వర్కర్స్ కు కనీస వేతనాలచెల్లించాలని ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి రమణకుమారి జిల్లా నాయకురాలు మాధవిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికల సందర్భంగా టిడిపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఆశ వర్కర్స్ కు వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని వాగ్దానం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి నాయకులు ఆశా కార్యకర్తలను అక్రమంగా తొలగింపులకు గురి చేస్తూ రాజకీయ వేధింపులు చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం ఇలాంటి చర్యలను ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వానికి ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను ఇబ్బందులకు గురి



చేస్తూ తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అక్రమంగా తొలగిస్తే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేయాల్సి వస్తుందని వారు తెలిపారు. టిడిపి ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు కల్పించి తమ అనుయాయులకు ఇవ్వాలని వారు కోరారు. అతి తక్కువ వేతనాలతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరారు. ఆశా కార్యకర్తలను విలేజ్ క్లినిక్ మరియు సచివాలయాల దగ్గర ఉదయం నుండి సాయంత్రం వరకు ఉండాలని ఉదయము సాయంత్రము రిజిస్టర్లో సంతకాలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు ఆశా కార్యకర్తలకు సెలవులు లేకపోవడం అనారోగ్యాల పాలవుతున్నారు ఆశా కార్యకర్తలకు సంబంధం లేని అనేక పనులు చేయిస్తున్నారు వెంటనే ఆపాలని ఆశాలతో సంబంధం లేని పనులు చేయించరాదని వారు కోరారు. ప్రభుత్వ సెలవులు మెడికల్ లీవులు వేతనంతో కూడిన మేటర్నిటీ లీవులు లీవులు ఇవ్వాలి. ఆశా కార్యకర్తలకు 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి ఏ కారణంతో మరణించినా మట్టి ఖర్చులు ఇవ్వాలి. ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు ఇవ్వాలి రిటర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలి ఆశా కార్యకర్తల రిక్రూట్మెంట్లో రాజకీయ జోక్యము లేకుండా చూడాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వృద్ధాప్య పెన్షన్ వీడో పెన్షన్ ఒంటరి మహిళ పెన్షన్ ఇంటి స్థలం ఇచ్చి పక్కా గృహం నిర్మించి ఇవ్వాలి ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. నాణ్యమైన సెల్ ఫోన్లు 4%ౖ% సిమ్ ఇవ్వాలి ప్రభుత్వమే రికార్డ్స్ ఇవ్వాలి ఆశా కార్యకర్తలకు రూరల్ లో వెయ్యి నుంచి 1200 మంది పట్టణాలలో 2000 నుంచి 2500 మంది జనాభా ఒకరు చొప్పున నియమించాలి. ఆశా కార్యకర్తల పైన పనిభారం తగ్గించాలి. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రతినిధి వర్గంతో చర్చించి ఒప్పుకున్న డిమాండ్స్ అన్నిటినీ జీవో రూపంలో ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని నంద్యాల డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ కి ఇవ్వడం జరిగినది.

## నేడు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాలలో మంగళ కైసిక ద్వాదశి వేడుకలు

**-గోవిందుడు అందరివాడు అని తెలుపుటకే మంగళకైశిక ద్వాదశి వేడుకలు. -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**

ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 12:
భగవంతుడు జాతి, కుల, మత, వర్ణ, వర్గ, లింగ, ప్రాంత భేదాలకు అతీతుడని, ఆయన భక్త సులభుడని, నిర్మలమైన హృదయం ఎక్కడ ఉంటుందో అక్కడ ఉంటాడని తెలుపుటకే తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళకైశిక ద్వాదశి వేడుకలు నిర్వహిస్తున్నదని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు



వేంకటరెడ్డి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నంద్యాల మండలం పొన్నాపురం, ఆళ్ళగడ్డ ఎస్సీ కాలనీ, గూడూరు ఎస్సీ కాలనీ, కల్లూరు మండలం పర్ల లోని ఎస్సీ కాలనీలలో బుధవారం ఉదయం 9 గంటల నుండి శ్రీ వేంకటేశ్వర స్వామి హోమం, సహస్రనామార్చన, నామ సంకీర్తన, మాల దాసరి వృత్తాంతం కథాగానం, భక్తులందరికీ తీర్థ ప్రసాద వినియోగం మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# హెచ్. ఐ.వి /ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతో... నియంత్రించ వచ్చు

## -మెడికల్ ఆఫీసర్ డాక్టర్.ఉదయసంధ్య




ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 12:
నంద్యాల మండలం.భీమవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంస్థ హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధుల పట్ల మరియు రక్త పరీక్షలు లపై ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి సర్పంచ్ భక్త వాత్సల్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అలాగే మెడికల్ ఆఫీసర్ డాక్టర్.ఉదయసంధ్య మాట్లాడుతూ హెచ్.ఐ.వి వ్యాధి పట్ల వలస కూలీలు,హమాలీ వర్కర్స్, మరియు యువత కు హెచ్.ఐ.వి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్.ఐ.వి కి గురికాకుండా ఉండాలని తెలిపారు.
హెచ్.ఐ.వి కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు , హెచ్.ఐ.వి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సూదులు సిరంజీలు, పరీక్షింపబడని రక్తము ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్.ఐ.వి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదేవిదంగా జోనల్ సూపర్ వైజర్ ఎస్. మీరాంరెడ్డి మాట్లాడుతూ హెచ్.ఐ.వి. ఉంది అని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఆర్టి కేంద్రాలు, లింక్ ఏఆర్టి కేంద్రాల ద్వారా ఉచితంగా ఏఆర్టి మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటించినట్లయితే వైరస్ నియంత్రణ కలిగి ఎటువంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చు అని తెలియచేసారు. హెచ్.ఐ.వి. ఉందనే కారణంతో వివక్ష చూపకూడదు అని, అది హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ చట్టం - 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలియచేసారు.
హెచ్.ఐ.వి. పట్ల ఎటువంటి సందేహాలు/ అనుమానాలు ఉన్నా జాతీయ హెల్ప్ లైన్ 1097 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలియచేసారు. ఈ కార్యక్రమం ఉమ్మడి కర్నూల్ జిల్లాలో 100 గ్రామాల్లో అవగాహన సదస్సులు మరియు సేవలు అందించడం జరుగుతుందని చేప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సురేష్ బాబు, ఎ.ఎన్. ఎం.ప్రశాంతి కుమారి సి హెచ్ ఓ, మహాలక్ష్మి ఆశాలు,మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ఆశ్రమాల్లోని వృద్ధులకు యువత అండగా నిలవాలి



ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 12
సొంతవారి ప్రేమకు దూరమై వృద్ధాశ్రమాల్లో, అనాధ ఆశ్రమాల్లో తల దాచుకుంటున్న వృద్ధులకు నేటి తరం యువత అండగా నిలవాలని, సేవ అనేది ఆత్మ సంతృప్తిని ఇచ్చే ఉత్తమ మార్గమని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. చలి కాలాన్ని దృష్టిలో వుంచుకొని స్థానిక సంస్థ ఆధ్వర్యంలో పద్మావతి వృద్ధాశ్రమం, ఓబులాపురం శ్రీ కాశీనాయన సేవాశ్రమం ఆశ్రమాల్లో చలికి ఇబ్బంది పడుతున్న వృద్ధులకు చలి కోట్లు అందించారు. ఈ చలి కోట్ల పంపిణీకి సాయం అందించిన అజ్ఞాత దాతకు స్ఫూర్తి సభ్యులు, వృద్ధులు ధన్యవాదములు తెలిపారు. సేవ చేయడం అనేది మంచి మార్గమని, ప్రతి ఒక్కరు సేవా మార్గంలో నడవాలని స్ఫూర్తి బృందం సభ్యులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర్, మారెళ్ల వాసు, హుమయున్, మోహన్ రెడ్డి, లలిత హోటల్ శివ, సాయి, రాజా హర్షవర్ధన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ సభ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12: నంద్యాలలో నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి దగ్గర కిసాన్ సభ జిల్లా ఆఫీసును టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ కిసాన్ సభ యాప్ రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతుందని వివరించడం జరిగింది. కిసాన్ సభ ప్రాజెక్ట్ సిఎస్ఐఆర్ ద్వారా అప్రూవల్ పొంది రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు రైతులకు గిట్టుబాటు ధర సబ్సిడీ ఎరువులు మండి డీలర్లు రవాణా సర్వీసులో కిసాన్ సభ యాప్ లో ఉంటాయని తెలిపారు రైతులు తమ పండించిన పంటను వృధా అవ్వకుండా సమయానికి మార్కెట్ కి తీసుకు వెళ్లడానికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఎం.విఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ , నంద్యాల ఏడిఏ రాజశేఖర్ , ఎస్ఎస్ మాన్ పవర్ సర్వీసెస్ సీఈవో బొడ్ల శీను , రీజనల్ ఇన్చార్జ్ ముతాహర్ సుల్తానా , నంద్యాల జిల్లా ఇంచార్జ్ ఎం.వి నాయక్ , జి వెంకటసుబ్బయ్య , దాసరి శ్రీనివాసులు , లీగల్ అడ్వైజర్ రాజు మరియు నంద్యాల జిల్లా పిఆర్వోలు మండల పిఆర్ఓలు , రైతులు పాల్గొన్నారు.

# చాబోలు గ్రామంలో పొలంబడి కార్యక్రమం



ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 12:
చాబోలు మరియు హై స్కూల్ కొట్టాల గ్రామాల లో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యములో పొలంపిలుస్తోంది కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హై స్కూల్ కొట్టాల గ్రామం నందు జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు వై. వి మురళీ కృష్ణపాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలు గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంట కోత దశలో ఉన్నదని వరి కోసిన తర్వాత రెండవ పంటగా అపరాలు అయిన మినుము లేదా పెసర లేదా అలసంద సాగు చెయ్యాలని దీని వలన భూమిలో చౌడు తగ్గి సారవంతంగా తయారవుతుందని, అలాగే ప్రస్తుతం రబీలో సాగైన జొన్న పంటను కాండం తొలిచే పురుగు మరియు కత్తెర పురుగు ఆశించడం జరిగింది అని వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇందుకు గాను ఎకరాకు 6-8 లింగార్షక బట్టలు, పంటలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో కార్బో 1ఫ్యురాన్ 8-10 కేజీ ల మొక్క సుడులలో వేసుకోవాలని లేదా ఐమా మెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ద్వారా రబీ పంట కాలం లో పంటల భీమా పథకం అమలు చేయడం జరుగుతుంది , ప్రస్తుతం రబీ 2024-25 కాను శనగ గ్రామ యూనిట్ గా, వరి, జొన్న, మినుము మండలం యూనిట్ గా , వేరు శనగ, ఉల్లి జిల్లా యూనిట్ గా పంటల భీమా పథకం లో చేర్చారని తెల్పారు. శనగ పంట రైతూ వాటా ఏకరానికి రూ 84/-, వరి కి రూ 126/-, జొన్న - రూ 59/-, మినుము - రూ 48/- రైతులు తమ వాటా ప్రీమియం అమౌంట్ కట్టుకోవడానికి వరి పంట డిసెంబర్ 31 లొపు, మిగతా పంటలకు డిసెంబర్ -15 ,లోపు నిర్ణయించడం జరిగిందనీ,తదుపరి వివరాలకు రైతు సేవ కేంద్ర సిబ్బంది నీ సంప్రదించాలి అని తెలపడమైనది. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ముక్తార్ భాష , మహేష్ ,రైతు సేవ కేంద్రం సిబ్బంది నాగ హర్షిత మరియు వైష్ణవి మరియు గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

# 42 వార్డులో టీడీపి సభ్యత్వ నమోదు కార్యక్రమం.

## పరిశీలించిన 42వ వార్డు అబ్జర్వర్ పోతురాజు రవికుమార్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12:
నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు పోతురాజు రవికుమార్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని పరిశీలించారు.ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ పోతురాజు రవి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్లో నంద్యాల నియోజకవర్గ మొదటి స్థానంలో ఉందని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల నియోజకవర్గ 8వ స్థానంలో ఉందని తెలియజేశారు. గతంలో కంటే మెరుగ్గా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై ప్రజలు తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకుంటున్నారని తెలియజేశారు . ఈ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కి , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచండి.!

-ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించండి.
-విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించండి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.




ఆంధ్ర ప్రగతి నంద్యాల,నవంబర్ 12:
జిల్లాలోని 86 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వసతి గృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ఎస్సీ, బిసి రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, గురుకులాల అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలను చదివించేందుకు పంపిస్తున్నారని వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లపై అవగాహన కల్పించడం, విద్యాబుద్ధులు నేర్పించడంపై సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గతంలో తాను కొన్ని వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశానని అపరిశుభ్ర వాతావరణం, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు లేకపోవడం, టాయిలెట్లు పరిశుభ్రంగా లేకపోవడం, కొన్ని చోట్ల టాయిలెట్లే లేకపోవడం గమనించానని... అత్యంత దయనీయ పరిస్థితులలో వసతి గృహాలు నెలకొన్నాయన్నారు. హాస్టలల్లో ఉన్న వసతులతోనే పరిశుభ్రంగా వుంచడంతో పాటు కనీస మౌలిక వసతుల ఏర్పాటుపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను ఖచ్చితంగా పిల్లలకి ఇవ్వాలని... ఇందులో తేడాలోస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, టాయిలెట్లను శుభ్రంగా ఉంచడంతోపాటు పారిశుద్ధ చర్యలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు చదువులో నైపుణ్య మెళుకువలను పెంపొందించి ఉత్తీర్ణత శాంతాన్ని పెంచేందుకు కృషి చేయాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలలో ప్రహరీ గోడలు, ఆర్వో ప్లాంట్లు, సివిల్ వర్క్ లు , పాత బిల్డింగులు, స్టాఫ్ క్వాటర్స్ లేవని రకరకాల సమస్యలు చెబుతున్నారని ఇందుకు సంబంధించిన దస్త్రాలు గత నాలుగు నెలల నుండి ఒక ప్రతిపాదన కూడా కలెక్టరేట్ నుండి ప్రధాన కార్యాలయాలకు వెళ్లలేదని తెలియజేస్తూ సంబంధిత సమస్యల ప్రతిపాదనలను మూడు రోజులలో తనకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న సిఎస్ఆర్ నిధులతో త్రాగునీటి వసతి, టాయిలెట్ల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వసతులు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బిసి వెల్ఫేర్ అధికారి ముస్తక్ అహమ్మద్, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, బిసి రెసిడెన్షియల్ వెల్ఫేర్ కన్వీనర్ ఫ్లోరా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, అన్ని ప్రభుత్వ వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాల సగరకుల (ఉప్పెర) కార్తీక వనభోజనం ఆహ్వానం



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 12: నంద్యాల అసెంబ్లీ సగర (ఉప్పర) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8 వ కార్తిక వనభోజన కార్యక్రమానికి ఎన్ఎండి ఫయాజ్ ను ఆహ్వానించిన సభ్యులునంద్యాల అసెంబ్లీ సగర (ఉప్పర) సంక్షేమ సంఘం మరియు యువజన సంక్షేమ సభ్యులు ఆధ్వర్యంలో 17వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు చాము కాల్వ దగ్గర ఉన్న ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం వైయస్సార్ ఫంక్షన్ హాల్ నందు జరుగు 8 కార్తిక మాస వనభోజన కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని సగర (ఉప్పర) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పరి సురేష్ కుమార్ , నంద్యాల అధ్యక్షులు బోయని బాలాజీ , ప్రధాన కార్యదర్శి చిలకల బాలరాజు యువజన సంఘం అధ్యక్షుడు హరి ఆహ్వానించడం జరిగింది.

# ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా

అమరావతి,నవంబర్12 ఆంధ్ర ప్రగతి:
ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా పడ్డాయి. వచ్చే ఏడాది జనవరి 5న జరగాల్సిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 23కి వాయిదా వేశారు.
పరీక్ష తేదీ ప్రకటించినప్పటి నుంచి పరీక్ష నిర్వహించే తేదీ మధ్య కనీసం 90 రోజుల పాటు సమయం ఉండాలి. అయితే, ఈసారి ఆ సమయం 60 రోజులే ఉండడంతో, పరీక్షకు సన్నద్ధం కాలేమన్న ఆందోళన గ్రూప్-2 అభ్యర్థుల్లో వ్యక్తమైంది. దాంతో వారు ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ అనురాధను కలిసి, గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల తేదీని మార్చాలని, పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు తమకు మరికొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమిద్దాం: పీడీయస్‌యూ





ఆంధ్ర ప్రగతి కర్నూలు ,నవంబర్ 12:
దేశంలోని పేద బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థులందరికీ అసమానతలు లేని సమానమైన శాస్త్రీయమైన విద్య అందించాలని ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థి అమరవీరుల అయినా జార్జిరెడ్డి జంపాల చంద్రశేఖర ప్రసాద్ శ్రీపాద శ్రీహరి కోలాశంకర్ చేరాలు రంగవల్లి స్నేహాలత వంటి విద్యార్థి అమరవీరుల స్మరించుకుంటూ వారి యొక్క ఆశయా సాధనకు కృషి చేస్తూ ప్రభుత్వాలు విద్యార్థులుపై అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలిని పీడీయస్ యూ జిల్లా నాయకులు రాజేష్, టియుసీఐ జిల్లా నాయకులు తిరుపాలు పిలుపునిచ్చారు అనంతరం నగరంలో విద్యార్థి అమరవీరుల సభను నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసి విద్యార్థులకు నాణ్యమైనటువంటి విద్యను అందించడంలో విఫలమవుతున్నారన్నారు కొఠారి కమిషన్ ప్రకారం విద్యారంగానికి జాతీయ స్థూల ఉత్పత్తిలో 6% కేంద్ర బడ్జెట్ లో 10% రాష్ట్ర బడ్జెట్ లో 30% ఇవ్వాలని విద్యారంగానికి కేటాయించాలని ఉంది కానీ విద్యారంగంను పూర్తిగా విస్మరించింది అని అన్నారు.
కేంద్ర ప్రభుత్వం మానవతా విలువలు కలిగిన విద్యను అందించాలని ఆలోచన చేయకుండా విద్యను కాషాయికరణం చేయడానికి పూనుకుంది అని అన్నారు దేశంలో విద్యార్థులను సైతం మతం పేరుతో విచ్ఛిన్న కరంగా చేస్తున్నదిన్నారు, రాష్ట్రం కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది అంటూ విద్యారంగానికి బడ్జెట్ కేటాయించకుండా అవలంబిస్తుందని అన్నారు అధికారం రాకముందు పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77 రద్దుచేసి ఫీజు ఫీజు నెంబర్స్ మెంట్ వారికి ఇస్తాం చెప్పి తీరా అధికారంలోకి వచ్చి ఈ విద్యా సంవత్సరం నుంచి ఇవ్వకుండా విద్యార్థులను మోసం చేశారన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీసంక్షేమ హాస్టల్లో పక్క భవనాలు మెరుగైన వసతులు కల్పించకుండా కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది అన్నారు. కాబట్టి ప్రభుత్వాల యొక్క విద్య వ్యతిరేక ఆలోచనలను తిపికొడుతూ విద్యార్థుల యొక్క సమస్యల పై ఉద్యమిస్తు విప్లవ విద్యార్థి అమరవీరుల ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో పిడిఎస్ యు నాయకులు రాజు , అభి,సుధీర్,వెంకటేష్ లు పాల్గొన్నారు.